



# నిశ్చలన చిత్రం

ఆడెపు లక్ష్మీపతి

**సంపాదనే ధ్యేయమయిన ఒక పత్రికాఫీసులో, అదే ధ్యేయంతో సతమతమయ్యే ఫోటోగ్రాఫరు కళ్లకు నిశ్చలంగా ఉన్న సముద్రం కాలిపోతున్నట్లు కన్పించిందెందుకు?**



వెండి నగిషీలు చెక్కి అందంగా అంచులు తాపడం చేసిన, పెద్ద సైజు రోజ్‌వుడ్ టీ పాయ్ మీద ఒక వైపు ఆర్టుకీ, మరొక వైపు ఫోటో గ్రఫీకు సంబంధించిన పత్రికలు. వాటి మీద వాడినవీ, వాడనివీ కలగలిసిన ఫిల్ముల దొంతరలు. మరో వైపు పేక ముక్కల్లాగా పడి ఉన్న కలర్ ఫోటోలు. టీపాయ్ మీద దాదాపు మధ్య భాగంలో విశ్వవిఖ్యాత ఫ్రెంచి శిల్పి రోడిన్- మలచిన 'ది యంగ్ మదర్', 'దికిస్' శిల్పాల కంచు ప్రతిమలు తళతళ మెరుస్తున్నాయి.

కలర్ ఫోటోలను చూస్తూ ఆర్టు డైరెక్టరు, ఫోటో ఎడిటర్ వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఫోటో గ్రాఫర్ రవివర్మ కుర్చీలో కూర్చొని చిన్నగా వెనక్కీ ముందుకూ ఊగుతూ వాళ్ళు చెప్పేది వింటున్నాడు.

"నేను ఈ ఛాయా చిత్రాలను అన్ని కోణాల్లోంచీ పరిశీలించాను. లోపాలు కనిపెట్టాను. కొన్నింటిలో ఫోకసింగ్ బాగా లేదు. ఇంకొన్నింటికి సెట్ నప్పలేదు. మరికొన్ని చిత్రాల్లో అన్నీ బాగున్నప్పటికీ- లోపంగా పరిణమించినది ఆమె చూపులు! సబ్జక్టు చూపులు కఠినంగా ఉన్నాయి" అన్నాడు ఆర్ట్ డైరెక్టరు.

ఒక్కొక్క ఫోటోను ఎత్తి చూపుతూ ఫోటో ఎడిటర్ "చాలా ఫోటోల్లో సబ్జక్టు కన్నా పరిసరాలు ప్రాబల్యం వహించినట్టుగా ఉంది. పరిసరాలు నేపథ్యంగా సబ్జక్టు ప్రధానంగా ఉండాలి. అలాలేకపోతే ఫోటోగ్రాపు నిర్జీవంగా, పేలవంగా ఉంటుంది" అన్నాడు.

"పోలరాయిడ్ ఫిల్ము. ఎక్టాక్రోమ్ ఫిల్ము ఊరికినే వ్యర్థమవుతోంది. ఇప్పటివరకూ ఇరవై పిక్చర్లు తీశారు. అన్నీ రిజెక్టు అయినాయి. మీరు మరింత శ్రద్ధతో వ్యవహరించాలి."

తరువాత వాళ్ళిద్దరూ ఫోటోగ్రఫీ కళ గురించీ, ప్రఖ్యాతి గాంచిన ఫోటోగ్రాఫర్ల గురించీ మాట్లాడారు. వాళ్ళ సంభాషణలో గ్రిజిలీ ఫ్రీయాండ్, ఆడ్రియన్ స్టీవెన్, ఆర్నాల్డ్ డ్రాప్‌కిన్ వంటి విదేశీయుల పేర్లూ, రఘురామ్, అవినాశ్ పత్రీచ్చా మొదలైన భారతీయుల పేర్లూ దొర్లాయి. వాళ్ళ పనితనం గురించీ, ఒక్కొక్కరి విన్యాసాల మధ్య పోలికలు- వ్యత్యాసాల గురించీ రవి వర్మకు వినబడేటట్లు ముచ్చటించుకొన్నారు.

'తను తీసిన ఫోటోలకు వంకపెట్టడం, రంధ్రాన్వేషణ చేసి తృప్తి పడడం వీళ్ళకు అలవాటే! పబ్లిషరుకు తన మీద అభిమానం. అదే వీళ్ళ అసూయకు కారణం. వీళ్ళ మాటలు పట్టించుకో నవసరం లేదు. పబ్లిషర్ అభిప్రాయమే తనకు శిరోధార్యం' అనుకొన్నాడు. రవివర్మ.

"మీ వ్యాఖ్యలకు ధన్యవాదాలు! ఇంతకీ గుప్తా గారేమన్నారో చెప్పారు కాదు" అడిగాడు రవివర్మ.

"ఆయన ఇవన్నీ చూసి రిజెక్టు అన్నాడు. కారణం ఏమి చెప్పాడో తెలుసా? ఫోటోలో ఏమీ మెరుగు లేదన్నాడు. పాత పద్ధతుల్లో మూస పోసినట్టున్నాయన్నాడు. 'కెమెరా విన్యాసంలో ముందంజ, చిత్రాల్లో ప్రగతి నాకు కావాలి" అన్నారాయన చెప్పాడు ఫోటో ఎడిటర్.

రవివర్మ 'ది కిస్' ప్రతిమను తదేకంగా చూసి, లేచి నిలబడ్డాడు.

"ఈసారికి మీ కృషి విజయవంత మవుతుందని ఆశిస్తాం. ఈ రోజు మేము ఇళ్ళకు వెళ్ళగలమా లేదా అన్నది మీ దయ మీద ఆధారపడి ఉంది. పత్రికకు అన్ని విధాలా మేటర్ సిద్ధమయింది. ఒక్క మీకు సంబంధించిన విభాగం మాత్రమే మిగిలిపోయింది. పత్రిక విడుదల కావడానికి నాలుగు రోజులు మాత్రమే వ్యవధి ఉంది" అన్నాడు ఆర్ట్ డైరెక్టర్ వెళ్ళిపోతూ. ఫోటో ఎడిటర్ అతడ్ని అనుసరించాడు.

రవి వర్మ కింగ్‌సైజు సిగరెట్ ప్యాకెట్, లైటరూ చేతబుచ్చుకొని స్టూడియో బయటకి నడిచాడు. కుడివైపు తిరిగి కారిడార్ గుండా నడిచి, దాని చివర ఆగాడు. అక్కడ పై అంతస్తులకు వెళ్ళేందుకు మెట్లు ఉన్నాయి. మెట్ల అంచులకు ఇనుప రెయిలింగ్‌లు ఉన్నాయి.

'సర్తకి' పత్రిక ఆఫీసు బిల్డింగు ఉంది. మూడో అంతస్తులో ఉంది స్టూడియో. వెల్వెట్ కాడ్రాయి ప్యాంటును ఎగలాగాడు. బ్రౌనుకలర్ గళ్ళ చొక్కా కాలర్ సవరించుకొన్నాడు. హాండ్ కఫ్స్‌ను మోచేతుల పైకి మడిచాడు. నలుపు- తెలుపు కలబోసినట్టున్న చిక్కటి జుత్తును రెండు చేతుల వేళ్ళతో దువ్వినట్టుగా దువ్వాడు.

రెయిలింగ్ రాడ్లపై చేతులు ఆన్చి నిలుచున్నాడు రవి వర్మ. విశాల ప్రపంచం వేపు

చిన్నా విశ్రాంతిగా ఊపిరి పీల్చాడు. సముద్రం మీది నుంచి వీస్తున్న చల్లని గాడ్పులు అతడ్ని అలసట నుంచి సేద తీర్చాయి. బీచి, సముద్రం, బీచి రోడ్డు, బీచి మీది ఇసుక సాయం సంధ్యా సమయంలో బంగారంలా మెరుస్తున్నాయి. దిగంతాల వరకూ విస్తరించుకుపోయిన సముద్రం ప్రకృతి మాత నీలం రంగు చీరలా ఉంది. బీచి రోడ్డు మీది ట్రాఫిక్ ఉరికురికి వస్తున్న సాగర కెరటాల్లాగ ఉంది.

సిగరెట్టు వెలిగించి గాఢంగా దమ్ములాగాడు. గుండెల నిండుగా .పొగ పీల్చి రింగులుగా వదిలాడు. మధ్యాహ్నంనుంచి శ్రమించి తీసిన ఫోటోలన్నీ తిరస్కరించారని అతడికి అవమానంగా ఉంది. కలతగా తల నొక్కుకొన్నాడు. తన ఫోటోలను గురించిన గుప్తా గారి వ్యాఖ్యానం మరో సారి తలచుకొన్నాడు.

మెరుగు, ముందంజ- ఈ పదాల నిర్దేశం వెనుక పబ్లిషర్ పథకం, ఎత్తుగడలను, బేరీజు వేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. తీవ్రంగా ఆలోచించాడు. ఆరు నెలల విరామం తర్వాత 'నర్తకి' పత్రిక పునఃప్రారంభ మయ్యేటప్పుడు దాని ప్రచురణకర్తతో తనకు జరిగిన సంభాషణ మననం చేసుకొన్నాడు.

రెండు మాసాల క్రితం గుప్తా గారి నుంచి కబురందుకొని ఆయన ఆఫీసుకెళ్ళాడు రవివర్మ. ఎయిర్ కండిషనర్ చేస్తున్న చిన్న శబ్దం, సీలింగ్ ఫ్యాను గాలికి రెపరెపలాడుతున్న కాగితాల చప్పుడు తప్ప ఆ ఆఫీసు నిశ్శబ్దంగా ఉంది. గుప్తా గారు కూర్చొని ఉన్న రివాల్వింగ్ కుర్చీ వెనక తల మీదుగా లేత ఆకుపచ్చ రంగు గోడలకు దేశ నాయకుల పటాలు, కొద్దిమంది అధికార పార్టీ నేతల ఫోటోలు వేళ్ళాడుతున్నాయి. సీటుకు కుడివైపున గోడకు పత్రిక సర్క్యులేషన్‌కు సంబంధించిన గణాంక వివరాలు తెలిపే ఫిక్సో గ్రాఫ్ బోర్డు, ఎడమ వైపున అలాంటిదే మరో పెద్ద బోర్డు దాని మీద ఆయన ఆధిపత్యంలో నడుస్తున్న వివిధ రకాల కంపెనీల షేర్లూ, లాభాలూ తెలుపుతున్న తెల్లని అంకెలు.

రవి వర్మ నమస్కారాన్ని నవ్వుతూ స్వీకరించి ఎదురుగా ఉన్న కుర్చీని చూపి, బంగారంతో చేసిన డబ్బాలోంచి పొగాకు తీసి పైపులో కూర్చుతూ "ఈ ఆరు నెలలూ ఏం చేస్తుండిపోయారు వర్మా?" అన్నారు.

"ఏముంది? గతంలోలానే రోడ్లమీద పడ్డాను. ఫ్రీ-లాన్స్ కార్యక్రమాలు సాగించాను."

నర్తకి పత్రికలో ప్రవేశించక మునుపు రవి వర్మ ఫ్రీలాన్స్ ఫోటోగ్రాఫర్. చాలా తిరిగాడు. ప్రకృతి దృశ్యాలు, రాజకీయ నాయకుల హావభావాలు, నృత్య కారుల ముద్రలు లాంటివి విభిన్న కోణంలో, కొత్త తరహాలో తన కెమేరాలో బంధిస్తుండేవాడు. ఉత్తమ ఫోటోగ్రాఫర్ల శ్రేణికి చెందినవాడని పాత్రికేయుల, మేధావుల ప్రశంస లందుకొన్నాడు. కళాభవన్‌లో అతడి ఫోటో ప్రదర్శనను చాలా మంది కొనియాడారు.

పారిశ్రామిక వేత్త అయిన గుప్తా గారు అతని ఫోటోలను తిలకించి పని తనాన్ని తెగ మెచ్చుకొన్నారు. అతనికి బాగా నచ్చిన ఫోటోలు- ఆటల్లో క్రీడాకారుల భంగిమలు, మేళాలో నదీ స్నానం తర్వాత తడిసిన ఉడుపుల్లోంచి తమ మేని వంపు సొంపులు ప్రదర్శిత మవుతున్నాయన్న ధ్యాస లేకుండా అమాయకంగా నిలుచొని నవ్వుతున్న పల్లె పడుచుల పోజులు. వెంటనే తను స్థాపించబోతున్న పత్రిక కోసం పని చేయమని అడిగాడు. చక్కటి జీతభత్యాలకు హామీ ఇచ్చాడు.

సంచార జీవితానికి ముగింపు వచ్చినందుకు సంతోషించి రవి వర్మ అంగీకరించాడు. పత్రిక బాగా వృద్ధిలోకి వచ్చింది. మంచి లాభాలు తెచ్చింది. గుప్తాగారు సంతోషించి రవి వర్మ పట్ల ప్రత్యేకమైన అభిమానం చూపి అతడి జీతభత్యాలు మరింత పెంచాడు. చీకూ చింతా లేని జీవితం. హిల్ కాలనీలో ఇల్లు. ఒక వెహికల్ సమకూర్చుకున్నాడు రవి వర్మ. కొడుకును ఇంజనీరింగ్‌లో చేర్పించాడు. అయిదేళ్ళు సజావుగా గడిచాయి. తరువాత మహిళా సంఘం కార్యకర్తలు పత్రికకు వ్యతిరేకంగా ఉద్యమించి ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసి ప్రచురణను నిలిపి వేయించారు.

"నర్తకి' మళ్ళీ ప్రచురింపబడుతోంది. రేపట్నుంచి మీరు ఆఫీసుకు వచ్చి బాధ్యతలు స్వీకరించండి" అన్నారు గుప్తాగారు.

"అంటే ఫిర్యాదులు, ప్రచురణ నిలిపివేత ఉత్తర్వులు వీగిపోయినట్టేనా?"

"అదంతా వ్యాపారపు ఎత్తుగడ. పత్రికా ప్రపంచంలో పోటీని తట్టుకొని, సర్క్యులేషన్ స్థాయిని యథాతథంగా ఉంచేందుకు నేను పన్నిన సరికొత్త వ్యూహం."

పైపు నోట్లో పెట్టుకొని లైటర్ కోసం చూస్తూ ఆగారు గుప్తాగారు. రవి వర్మ సిగరెట్ బయటికి తీసి, ముందు లైటర్‌తో గుప్తా గారి పైపు వెలిగించి తనది వెలిగించాడు.

గుప్పు గుప్పున పొగ వదులుతూ, "మిసెస్ రూపాదేవీ ప్రసాద్ తెలుసా?"అని అడిగారు గుప్తాగారు.

"పేరు విన్నాను. ఆవిడ పేరు మోసిన ఫెమినిస్టూ, ఆక్టివిస్టూ కదూ?"

"అవును. ఆమె నాకు బాగా తెలును. ఆమె భర్త భగవాన్ ప్రసాద్ వాణిజ్య ప్రపంచంలో నాకు మంచి మిత్రుడు. మన పత్రికలకు వ్యతిరేకంగా ఆవిడ ఫిర్యాదు చేసింది. స్పష్టంగా చెప్పాలంటే ఆవిడ చేత నేనే ఇప్పించాను ఫిర్యాదు."


ఆశ్చర్యంగా చూశాడు రవి వర్మ. "మన పత్రిక నిలిచిపోయింది ప్రెస్ కౌన్సిల్ వాళ్ళు విచారణ చేస్తున్నారు కదా?"

"అయితే ఏమయింది? విచారణ పూర్తయింది. నివేదిక కూడా అందించారు. సహజంగానే అది ఇలా ఉంది చూడండి" ఫైలులోంచి ఒక కాగితం తీసి రవి వర్మ కందించాడు. పరిశీలన జరిపిన ప్రెస్ కౌసిల్ సభ్యులు నర్తకి గురించి, నివేదించిన సారాంశం అది. రవి వర్మ అందుకొని చదివాడు.

"కొన్ని మహిళా సంఘాలు, స్త్రీ విమోచనోద్యమ సంస్థలు 'నర్తకి' అనే మాస పత్రికపై - అందులో విషయాలూ, ఫోటో గ్రాఫులకు వ్యతిరేకంగా- ఫిర్యాదు చేసిన దరిమిలా ప్రభుత్వం నియమించిన కౌన్సిల్ సభ్యులమైన మేము, ఆ పత్రిక సంచికలను కొన్నింటిని మా సముఖంలోనికి తెప్పించుకొని పరిశీలించాం. మా పూర్తి స్థాయి పరిశీలన అనంతరం మేం వెలిబుచ్చుతున్న అభిప్రాయం ఇది-

"పత్రికలోని చిత్రాలు, అర్థ నగ్నంగా ఉన్నప్పటికీ- అసభ్యంగా లేవు. పాఠకులలో కామోద్రేకాలు రెచ్చగొట్టేవిగా లేవు పత్రికలోని విషయాలూ, వ్యాసాలూ ప్రజల నైతిక వర్తనను దెబ్బ తీసేవిగా లేవు. మొత్తంమీద పత్రికలోని విషయాలూ, ఫోటోలు కళకి సంబంధించినవీ, ప్రశంసా పాత్రమైనవిగా అగుపడుతున్నాయి."

రవి వర్మ ముఖంలోని ఆశ్చర్యం క్రమంగా ఆనందంగా మారి పోయింది. అయినా అతడి



మస్తిష్కంలో ప్రశ్నలు తిరుగాడినయ్. గుప్తాగారు రవి వర్మ అవస్థను చూసి గుంభనగా నవ్వాడు. కుర్చీలోంచి లేచి కిటికీ దగ్గరికి నడిచాడు. కర్టెన్లు తొలగించి అద్దాల్లోంచి బయటకు దృష్టి సారించారు. నెక్టై వదులు చేశారు. రెండు మూడు దమ్ములు గబగబ లాగి పైపు నోట్లోంచి బయటికి లాగి అన్నారు-

"ఫిర్యాదూ, కౌన్సిల్ నివేదికా- ఈ రెండింటినీ దేశంలోని అన్ని వార్తా పత్రికలలో ప్రచురించే ఏర్పాటు చేశాను. ఇకనుంచి ఇవి మన పత్రికాభివృద్ధికి ఉపయోగపడతాయి. మనకుపోటీగా వస్తున్న పత్రికలు ఈ దెబ్బతో కుప్పకూలిపోతాయి. స్వల్పకాలంలోనే మార్కెట్ నుండి బిచాణా ఎత్తేస్తాయని నా నమ్మకం. ఈ కౌన్సిల్ నివేదిక అనే కవచాన్ని ధరించి మనం మన వార్తా పత్రిక బాణీ మార్చుతున్నాం. యూరోపియను, అమెరికను దేశాల్లో ప్రముఖంగా అమ్ముడుపోయే సెక్సు మేగజైన్ల స్థాయికి సరి తూగేటట్టుగా మన 'నర్తకి' ని తీర్చి దిద్దబోతున్నాం.

"కొత్తకొత్త శీర్షికలు ఈరోటిక్‌ఫిక్షన్‌లు, సెంటరుగేట్ ఫోల్డులు, న్యూడ్ ఫోటో వ్యాసాలు ఇలాంటివి ప్రవేశపెడుతున్నాం. ఈ వినూత్నశైలికి పాఠకులు విపరీతంగా ఆకర్షితులవుతారు. పత్రిక సర్క్యులేషన్ మరెన్నో లక్షలు పెరుగుతుంది. సంచిక సంచిక కోసం మార్కెట్టులో చకోర పక్షుల్లాగా ఎదురు చూస్తారు యువతీ యువకులు. అర్థమైందా వర్మా?"

"ఈ పరివర్తన నగ్నత నుంచి క్షుద్రానికి అవుతుందా?"

నిండుగా నవ్వారు గుప్తాగారు. "నో! నో! అర్థ నగ్న చిత్రాల స్థాయి నుంచి, దిగంబర చిత్రాల స్థాయికి ఈ పరివర్తన. శృంగార ప్రధాన మైన కథలు, కళ్ళు చెదిరే అందమైన అమ్మాయిల నగ్న చిత్రాలు వీటితో పత్రిక ముస్తా బవుతుంది. పాశ్చాత్య దేశాలు ఎన్నో రంగాల్లో ముందంజ వేస్తున్నాయి. వాళ్ళనుంచి మనం కొద్దిగా నైనా స్వీకరించాలి. భారతీయ యువత కోసం మనం కొత్త పుంతలు తొక్కడం అనివార్యం" అని కాసేపు ఆగారు గుప్తాగారు.

రవి వర్మ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ

"ఇకనుంచీ మన పత్రిక కొత్త శైలికి అనుగుణంగా మీ ఫోటోగ్రఫీలో వినూత్న వైవిధ్యం ఉండాలి. కెమెరా విన్యాసంలో మరింత నైపుణ్యం కనబరచాలి. మోడల్‌ల ఎంపిక కూడా నూతనంగా ఉండాలి. పాత వారు ఇకపై వద్దు. పదహారు, పదిహేడేళ్ళ తరుణ వయస్కులకుమాత్రమే పత్రికలో చోటివ్వాలి" అన్నారు.

అర్థమైనట్టుగా తల ఊపాడు రవివర్మ. మాసిన గడ్డం గోక్కొంటూ ఒక నిముషం తటపటాయించి అడిగాడు రవివర్మ. "సార్ కొంచెం డబ్బు అడ్వాన్సుగా ఇప్పించండి. ఇంటి ఖర్చులకూ, మా అబ్బాయి ప్రకాశ్ చదువు ఖర్చులకూ ఇబ్బందిగా ఉంది."

"మీ అబ్బాయి ఏం చదువుతున్నాడు?"

"యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ చదువుతున్నాడు. ఫైనల్ ఇయర్. ఫీజులకూ, దుస్తులకూ డబ్బు కావాలంటున్నాడు. పరిస్థితి క్లిష్టంగా ఉంది."

"అలాగే అవసరాలకు సరిపడా డబ్బు తీసుకోండి. రెండు నెలల జీతం ముందస్తుగా తీసుకోండి. మీ వాడు ఆర్కిటెక్చర్‌లో ఉన్నాడా? వెరీ గుడ్. నేను ముందు ముందు రంగప్రవేశం చేయబోయే హొటల్ బిజినెస్‌కు అతడు పనికివస్తాడు. నన్నోసారి కలవమని చెప్పు. శ్రద్ధాసక్తులు కలిగి ఉన్నవాడైతే పి.జి. కోసం నా ఖర్చులతో అమెరికా పంపిస్తాను" అని గుప్తా గారు చెక్కు రాసి చ్చారు.

రవి వర్మ ముఖం వెలిగిపోయింది. ఎర్రగా కాలుతున్న సిగరెట్ కొనలాగా. గదిలో కిటికీ వారగా ఉన్న కుండీలోని మొక్క కేసి చూశాడు. అది మునుపటి కంటే కొన్ని అంగుళాల్లు ఎదిగినట్టూ, పచ్చగా నిగనిగలాడుతూ చిన్నగా మొగ్గలు వేస్తున్నట్టుగా కన్పించింది.


"ఈ వ్యాపారాలు మనందరివీ. లాభాలను బట్టే మీ జీతాలు. నర్తకి ఈ నెల సంచిక మార్కెట్టులో ఉంటుంది. మీరు మీ పని ప్రారంభించండి. ఇక వెళ్ళ వచ్చు" అన్నారు గుప్తాగారు. రవి వర్మ కృతజ్ఞతలు మనస్ఫూర్తిగా చెప్పి సెలవు తీసుకున్నాడు.

సిగరెట్ కొన చివరికంటూ కాలి వేలు చురుక్కుమనడంతో వర్తమానంలోకి జారిపడ్డాడు. రవివర్మ. పబ్లిషర్ అభిలాష మేరకు ఫోటోల్లో చాలా మార్పు తీసుకొచ్చాడు. కాని ఈ మార్పు సరిపోదన్న మాట. ఆయనకు తృప్తికరంగా లేదు. మార్పు ఇంకా గొప్పగా ఉండాలి. ఈ విషయం బోధ పడనందుకు తన్ను తాను తిట్టుకున్నాడు రవి వర్మ. సెట్టుమార్చి మళ్ళీ మాట్ చెయ్యాలి. ఈ దెబ్బతో ఫోటోలన్నీ ఓకే అయిపోవాలి.

బీచివేపు దృష్టి సారించాడు. ఆడ మగ అంతా కలిసి కెరటాలలో జలకాలాడుతూ కేరింతలు కొడుతున్నారు. అర్థనగ్నంగా కొందరు, పూర్తి నగ్నంగా ఇంకొందరు ఇసుకలో పడుకొని అస్తమించబోతున్న సూర్య కిరణాలతో స్నానం చేస్తున్నారు. కాస్మోపాలిటిన్ సంస్కృతి అక్కడ సోషలిజం నీడపలె ఉన్నది. మెరుస్తున్న ఇసుక మీద- వివిధ రకాల, విభిన్న వర్ణాల శరీరాలు; వాటి మీద తమ ఉనికి స్పష్టంగా నిర్వచించుకోలేని ఆచ్ఛాదనలు. ఇంద్రధనుస్సును ముక్కలు ముక్కలుగా కత్తిరించి బీచిలో చెల్లా చెదురుగా జల్లినట్టుగా ఉందా దృశ్యం. నీలి కెరటాల మీద తేలుతూ మునుగుతూ ఒడ్డువేపు సాగిన జాలర్ల పడవలు నీటి పక్షుల్లాగ అగుపడుతున్నాయి. పైన నిర్మలమైన నింగిలో అక్కడక్కడా తెల్లని మబ్బు తునకలు చక్కని చిక్కటి వాలు జడలో తురిమిన మల్లె చెండులాగ ఉన్నాయి.

సెట్టు తయారీకి సంబంధించిన ఆలోచనలు రవి వర్మ బుర్రలో సుడులు తిరిగాయి. దృశ్యం తరువాత దృశ్యం- ఒకదాని తర్వాత మరోటి సినిమా రీలులాగ పరుగెత్తున్నాయి. చివర్న ముక్తాయింపు స్ఫురించినట్టుగా ఒక దృశ్యం కదలకుండా నిలిచింది. సన్నగా ఈల వేశాడు హుషారుగా. సిగరెట్టు పీక కింద పడేసి నిర్లక్ష్యంగా నలిపేశాడు. పెద్ద పెద్ద అంగలతో నడచి స్టూడియోలోకి ప్రవేశించాడు.

స్టూడియో లోపల వాతావరణం చల్లగా ప్రశాంతంగా ఉంది. పై కప్పు నుంచి ప్రకాశిస్తున్న ల్యూమినాయిర్‌ల వెలుగును, గోడల తెల్లరంగు తెల్లగా చల్లగా ప్రతిఫలింపజేస్తున్నది. సెట్టింగుకు కావలసిన రకరకాల కర్టెన్లు, పరికరాలు ఒక పక్కన నేర్పుగా అమర్చి ఉన్నాయి. ప్రతిభావంతుడైన చిత్రకారుడు గీసిన ఆహ్లాదకరమైన ప్రకృతి దృశ్యాలు స్వాభావికతనూ, సజీవతనూ ఒలికిస్తూ సన్నటి ఫ్రేములకు బిగించిన రెండు నిలువెత్తు క్యాన్వాసు గుడ్డల మీద నిదరబోతున్నాయి. పదడుగుల ఎత్తులో బలిష్ఠమైన మోనో స్టాండుకు అమర్చబడిన పోక రంగు ఎనిమిదీ పది కొలతల 'డియర్ డార్ఫ్' కెమేరా జిరాఫీ మెడలాగ నిలిచి ఉంది. కెమేరా అద్దానికి ఇరువైపులా ఫ్లాష్ లైట్లు ఎదురుగా ఉన్న సబ్జెక్టుకు అభిముఖంగా ఉన్నాయి. సబ్జక్టు అందమైన భంగిమను- లైట్లు గుమ్మరించే వెలుగు వెల్లువలో సంజాకుంటూ మింగేందుకు కెమెరా ఆవురావురుమని



ప్రతీక్షిస్తున్నట్టుగా ఉంది.

స్టూడియో నడుమ గుండ్రంగా వెల్‌వెట్ కవరింగ్ చేసి ఉన్న మెత్తని స్పాంజి కూచ్. దాని మీద దిగంబరంగా తెల్లని పాల నురుగలాంటి పొడవాటి కంబళి పొరల్లో- విశ్రాంతి ముద్రలో కూర్చొని ఉంది సబ్జెక్టు. ఆ మె పేరు ప్రత్యూష. శ్వేత గులాబీ పూరెమ్మల మధ్య చిక్కుకు పోయిన అరుద్ర పురుగులాగ ఉంది ఆమె. మావి చిగుళ్ళ వంటి వేళ్ళ కొనలతో ముఖం మీద వాలుతున్న ముంగురులను సుతారంగా పక్కకు తోసివేస్తూ చల్లని పానీయం తాగుతున్నది.

స్టూడియోలో తన ఆజ్ఞలకై ఎదురు చూస్తున్న సిబ్బంది నుద్దేశించి "సెట్టు మార్చాలి" అన్నాడు రవి వర్మ.

నవ్వడి విని ప్రత్యూష ఉలికి పడింది. పురుషులు ఎదురుపడగానే స్త్రీ సహజమైన లజ్జ ఆమెను ఆవహించింది. అప్రయత్నంగా కంబళి పొరలను గుండెల మీదికి లాక్కొని తన్ను తాను సవరించుకొన్నట్టుగా కూర్చుంది.

సిబ్బందిని ఆజ్ఞాపిస్తున్నాడు ఫొటోగ్రాఫర్- "సెట్టింగ్ మార్చండి దృశ్యాలేమి టంటే మొదటిది- ఆమె అప్పుడే సముద్రంలో మునిగి వస్తుంది. పడవ మీద రిలాక్సింగ్‌గా వెల్లకిలా పడుకొంటుంది. రెండో సీను- వెనకాల బీచ్ హౌజ్. ఇసుకలో క్విల్ట్ మీద బోర్లా పడుకొంటుంది. ఈ రెండు సీన్లకూ త్వరగా మాట్ చెయ్యాలి. తొందరగా చెయ్యండి."

సిబ్బంది చక చకా కదులుతూ తమ పనిలో నిమగ్నమయ్యారు.

ప్రత్యూషను చూసి చిన్నగా నవ్వాడు రవివర్మ. బదులుగా ఆమె సన్నగా మందహాసం చేసింది. దాని మాటున దాగిన సన్నని విషాదరేఖ లీలమాత్రంగా గోచరించింది.

"అయామ్ వెరీ సారీ బేబీ! ఇక నిన్ను ఎంతోసేపు ఇబ్బంది పెట్టను. ఇది చివరిది. ఇంకో రెండు గంటల తరువాత నిన్ను పంపించేస్తాను. అందాకా నాతో సహకరించగలవని ఆశిస్తాను. బాగా రాత్రి అయితే నేను తోడు వచ్చి టాక్సీలో నిన్ను ఇంటి దగ్గర దింపుతాను. సరేనా?" ఆప్యాయత, వాత్సల్యం ఉట్టిపడేలా అన్నాడు. ఆమె మౌనంగా తల దించుకొని కూర్చుండిపోయింది.

అతను ఫొటోగ్రఫీలో ఎంత నిష్ణాతుడో, మాటకారి తనంలో కూడా అంతే నేర్పరి. సబ్జెక్టును ప్రసన్నం చేసుకొనేందుకు బుజ్జగిస్తూ మాట్లాడతాడు. అవసరమయితే కఠినంగా శాసిస్తాడు. అవసరాన్ని బట్టి వ్యవహరించి మోడల్‌ల అందచందాలను సంపూర్ణంగా దోపిడీ చేసి, పోలరాయిడ్ ఫిల్ముమీద ముద్రిస్తాడు. ఇన్నేళ్ళ ఫొటోగ్రాఫర్ వృత్తిలో అతడు ఎన్నో విషయాలు నేర్చుకొన్నాడు. విషయ సేకరణకు ఓపికగా తిరుగుతాడు. తన నిశితమైన వాడియైన చూపులతో స్త్రీల అంగాంగాలను పరిశీలించి మోడల్‌గా పనికివస్తారా, లేదా అన్నది నిర్ధారిస్తాడు.

కాల హరణమూ, శ్రమా ఎంతైనా, అమ్మాయిలు ఒకవేళ కాబరే డాన్సర్లు, వృత్తి గత మోడల్‌లు, కాల్‌గరల్స్, రెడ్ లైటు ఏరియా స్త్రీలు అయితే స్టూడియోలో అతడు పెద్దగా కష్టపడక్కర్లేదు. ఎందుకంటే వాళ్ళు షూటింగ్‌కు సుపరిచితులే కాబట్టి. కాని ఒక్కొక్కసారి అమ్మాయిలు నేరుగా అతడి దగ్గరకే వస్తారు. వాళ్ళు సాధారణంగా డబ్బు అవసరమున్న విద్యార్థులు, సంసారపక్షం స్త్రీలు అయి ఉంటారు. కెమేరాకు కొత్త కాబట్టి బెరుకుగా ఉంటారు వీళ్ళు. ఫొటోగ్రాఫర్‌గా వాళ్ళ ముందు తన మాటకారి నైపుణ్యం ప్రయోగిస్తాడు.

ప్రస్తుతం స్టూడియోలో ఉన్న అమ్మాయిలూ, తనంత తానుగా మధ్యాహ్నం ఫొటోగ్రాఫర్ దగ్గరికి వచ్చింది. మోకాళ్ళ కిందికి వేళ్ళాడుతున్న చారల స్కర్టు, పైన పొడుగు చేతుల చొక్కా ఇన్‌షర్టు చేసింది. లోపల ఎర్రరంగు టీషర్టు. ఆ దుస్తులలో అధునాతనంగా కనిపిస్తూ, కొద్దిగా ఎర్రబడ్డ, పుసులు తోడిన కళ్ళు, కారుతున్న ముక్కుతో నలతగా ఉన్నట్టున్న ప్రత్యూషను ఫొటోగ్రాఫర్ పరిశీలించి చక్కటి శరీర సౌష్ఠవం అని గుర్తించి వెంటనే సబ్జెక్టుగా అంగీకరించాడు.

అరగంట తరువాత సెట్టు పూర్తయింది. రవివర్మ తాను స్వయంగా పడవ అంచుమీద పడుకొని పోజు వివరించాడు ప్రత్యూషకు. నిచ్చెన స్టాండు ఎక్కి కెమేరా వెనక నక్కాడు, మేకప్ గర్ల్ వచ్చి ప్రత్యూష జుట్టును దువ్వింది. కొద్దిగా టచప్ చేసింది. స్టైలిస్ట్ ఒకడు వచ్చి పడవ చుట్టూరా ఉన్న ఇసుకలో సముద్రము రాళ్ళూ, నత్తగుల్లలూ పరచాడు. అన్నీ అయినాక సిబ్బందిని అందరినీ బయటకు పొమ్మన్నాడు రవివర్మ.

ప్రత్యూష మీది కంబళి తొలగింది. ఆమె పడవమీద వెల్లకిలా వాలింది. ఒంటిమీద నూలుపోగు కూడా లేని ఆమె తనువు నారింజ పండులా మెరిసిపోతూంది. కుడి కాలు సాచి పడవ అంచుమీద, ఎడమ కాలి మోకాలు మడిచి తెడ్డుమీద ఆనించింది. వక్షస్థలాన్నీ, మెడనూ విల్లులా కిందికి వంచింది. ఆమె నల్లటి కేశపాశాలు ఇసుకలో విశృంఖలంగా జీరాడాయి. ఎడమ చెయ్యి వెనక్కి నెత్తి కింద మడిచింది. కుడి చెయ్యి నేలమీదికి జారవిడిచింది. దిసమొల దగ్గర్నుండి సాగిన తొడలు, కాళ్ళు త్రికోణాకృతిని సంతరించుకొన్నాయి.

"గుడ్! ఇపుడు ఛాతీ, పొత్తికడుపూ కెమేరావైపు తిరిగేలా కొద్దిగా కుడివైపుకు ఒత్తిగిల్లాలి. వెరీ గుడ్! ఏదీ ఒక్క నవ్వు! స్మైల్ ప్లీజ్!" మృదువుగా ఆజ్ఞాపించాడు రవివర్మ. సబ్జెక్టు అతడి ఆజ్ఞలను శిరసావహించింది. కెమెరా క్లిక్ మన్నది. ఫ్లడ్ లైట్లనుండి జిగేల్‌మని కాంతి జలపాతంలాగ ప్రవహించింది.


మరో దృశ్యం, బీచి హౌజ్ ముందు ఇసుకలో క్విల్ట్‌మీద బోర్లా పడుకుంది ప్రత్యూష. కెమెరా వైపుకు ముఖం. చేపపిల్లలా మెరుస్తున్న కనుదోయి. మిస మిస లాడుతున్న మెడ, నున్నటి జబ్బలు. లావణ్యం తొణుకుతున్న మేను, బరువైన వక్షాలు; గుండ్రంగా, బలిష్ఠంగా, ఎత్తుగా ఉన్న పిరుదులు, ముచ్చటగా మెరుస్తున్న పిక్కలు, నురుగు తరగలలో ఈదులాడుతున్న జలకన్యలా ఉంది ప్రత్యూష. మనోహరమైన ఆ భంగిమ డియర్ డార్ఫ్ కెమెరాలో ఘనీభవించింది.

"థాంక్యూ బేబీ! థాంక్యూ! నీ రూపమే కాదు, నీ మనస్సు కూడా అందమైనది" అంటూ కెమెరా వెనకనుంచి కిందికి దిగి వచ్చాడు రవివర్మ. ఫిల్మును ప్రాసెసింగ్ కొరకూ, డెవలపింగ్ కొరకూ కింది అంతస్తుల్లోని లాబొరేటరీకి పంపించాడు.

తాను ఇన్ని గంటలు స్టూడియోలో ఉండవలసి వస్తుందని అనుకోలేదు ప్రత్యూష. ఈ విషమ గడియలు గడిచి ముగింపు అయిందా, లేదా అన్నది ఆమెకు ఇంకా అర్థం కాలేదు. అసహనంతో కదిలి ఫొటోగ్రాఫర్‌ను కళ్ళతో ప్రశ్నించింది.

"ఓకే. బేబీ! షూటింగ్ ముగిసింది. నువ్వు ఇక కెమెరా ముందు ఉండవలసిన పని లేదు" అన్నాడు ఫొటోగ్రాఫర్ దృఢంగా.

చెంగున లేడిపిల్లలా దుమికింది. గబగబా తన



దుస్తుల్లోకి దూరిపోయింది. టీపాయ్ దగ్గర కుర్చీలో రిలాక్సింగ్‌గా కూర్చొని వాచీ చూసుకొంది. సమయం రాత్రి ఏడున్నర అవుతుంది. ఇప్పటి ఈ తతంగం ముగిసినా, తరువాతి కార్యక్రమం ఆమె మస్తిష్కంలో మెదలి కలవరపాటు రేపింది. తాను త్వరగా డబ్బు తీసుకొని గమ్యస్థానానికి తొందరలో చేరుకోవాలి. వణుకుతున్న చేతులతో నుదుటిమీది స్వేద బిందువులు తుడుచుకుంది.

"నన్ను ఇలా ఎంతసేపు స్టూడియోలో కూర్చోబెడతారు? ఒప్పందం ప్రకారం త్వరగా నా డబ్బివ్వండి. నేను వెళ్ళిపోవాలి."

"ఇం కొద్దిసేపు ఓపిక పట్టు. ఫోటో ప్రింట్లు పూర్తయినాక పానెల్ దగ్గరికి వెళతాయి. అక్కడ్నుంచి ఆఖరు ఆమోదం కోసం - పబ్లిషర్ గుప్తాగారి దగ్గరికి వెళతాయి. ఏది ఏమయినా ఇంకో నలభై నిమిషాల తరువాత నిన్ను డబ్బుతో సురక్షితంగా ఇంటికి పంపిస్తాను. సరేనా!"

ప్రత్యూష కళ్ళు మూసుకొని ఆలోచిస్తూ ఉండిపోయింది. చివరి ఫోటోగ్రాఫుల కోసం తాను నడుంమీద కనీసం చేప వల ముక్కలాంటి ఆచ్ఛాదన అయినా లేకుండా - తల్లి కడుపులోంచి ఊడి పడ్డట్టు కెమెరా ముందు పడుకొన్నది ఇప్పటిదాకా. తలచుకొంటే వంటిమీద తేళ్ళు, జెర్రెలూ పాకిన ట్లనిపించింది. అయినా రోట్లో తల పెట్టి రోకటి పోటుకు వెరచినట్టుగా ఉంది. అసలు తాను మార్గాంతరం లేక ఈ పనికి వప్పుకుంది. తరుముతున్న అవసరాలు అలా శాసించాయి. ఏమి టా అవసరాలు? ముఖ్యమైన అవసరం. అదే!

** ** **

వేళకు నిద్ర లేచే రాక్షసిలాగా - ఆమెలోని కోరిక నాగుబాములా బుసకొట్టి పడగ విప్పింది. నరాలు జివ్వుమని లాగాయి. రక్తప్రసరణ స్తంభించినట్టూ, విపరీతమైన నిస్త్రాణ ఆవహించినట్టూ, చూపుల నిలకడ కోల్పోయిన అనుభూతి. కళ్ళు తెరచి చూసేసరికి ఎదురుగా ఫోటోగ్రాఫర్ - నోట్లో వెలుగుతున్న సిగరెట్‌తో. పక్కన టీపాయ్ మీద సిగరెట్ పాకెట్టూ, లైటరూ! నిగ్రహం కోల్పోయిం దామె.

"నాకు ఇది కావాలి!" అంది పాకెట్టూ, లైటరూ చేత పుచ్చుకొని.

"తీసుకో!" అన్నాడు వర్మ.

ఆమె పాకెట్టులోంచి సిగరెట్‌తో పాటు అల్యూమినియం తగరాన్నీ బయటికి లాగింది. తన హాండ్ బాగ్‌లోంచి చిన్న పొట్లం తీసి విప్పింది. అందులోని తెల్లటి పొడి వంటి పదార్థాన్ని అల్యూమినియం తగరం మీద పోసింది. ఆ పొడి 'బ్రౌన్ షుగర్!' తగరం కిందినుంచి లైటరుతో వేడిని తాకించింది. వేడికి ఆ మత్తుమందు కరిగింది. వెలుగుతున్న సిగరెట్ కొనతో దాన్ని పీల్చింది. గాఢంగా దమ్ములు పీల్చింది. రెండు నిముషాల తరువాత మత్తుమందు మాయమయింది. సిగరెట్ చివరికంటూ కాలింది. ఆమె ఏవో లోకాల్లో తేలియాడింది. కల్పనా ప్రపంచంలో విహరించింది. మాదకద్రవ్యం మత్తు నషాళాని కంటింది. తన్ను తాను మింగుతున్నట్టూ, తన్ను తాను కరకరమని నములుతున్నట్టు బాధ. ఆ బాధలోనే ఆమె అవ్యక్తమైన ఆనందాన్ని అనుభవిస్తూ ఉండిపోయింది.

టక టక మన్న బూట్ల చప్పుడుతో ఆర్టు డైరెక్టరూ, ఫోటో ఎడిటరూ పైకి వచ్చారు - స్టూడియోలోకి.

"ఫోటోలు బ్రహ్మాండంగా ఉన్నాయి. గుప్తాగారు తెగ మెచ్చుకొన్నారు. పడవ సీను గేటు ఫోల్డు కోసమూ, క్విల్ట్ సీను ఫోటో వ్యాసాల కోసమూ కేటాయించ మన్నారు. ఫోటోగ్రాఫర్ ఇదే ఒరవడిని కొనసాగించా లన్నారు ఆయన" అని చెప్తున్నాడు ఆర్ట్ డైరెక్టర్.

"నువ్వు చాలా అందంగా ఉంటావు లవ్లీ! ఇదు నీ పారితోషికం. అప్పుడప్పుడు వస్తుంటావ్ కదూ?" కన్ను గీటుతూ, పళ్ళికిలిస్తూ చేయి సాచాడు ఫోటో ఎడిటర్, ఆమెకు డబ్బు అందిస్తూ.

రవివర్మ వినీ విననట్టున్నాడు. ప్రత్యూషనే గమనిస్తున్న అతడి మనస్సు నిజంగా జాలితో నిండిపోయింది, ఇంతదాకా బింకంగా నటించాడు కాని. ప్రత్యూష నిర్లక్ష్యంగా నోట్ల కట్టను బాగ్‌లో దోపుకున్నది. వంగి హైహీల్ చెప్పుల పట్టీలను బిగించుకొన్నది.

"ఈ పరిస్థితిలో, ఈ డబ్బుతో నీవు ఒక్కదానివి వెళ్ళలేవు. ఇంటికా, హాస్టల్‌కా? ఎక్కడికో చెప్పు. నేను దిగబెడతాను" అన్నాడు రవివర్మ.

ప్రత్యూష వాక్ప్రవాహం నిర్భీతిగా కొనసాగింది - "హాస్టల్‌తో నాకు పని లేదు. ఇక ఇంటి దగ్గర నాకోసం ఎదురుచూసేవారు ఎవ్వరూ లేరు. మా డాడీ భగవాన్ ప్రసాద్, వ్యాపారం పనిమీద ఢిల్లీ వెళ్ళారు. ఎప్పు డొస్తారో తెలియదు. మా మమ్మీ మిసెస్ రూపాదేవీ ప్రసాద్, ప్రముఖ సంఘసేవిక. ప్రస్తుతం ఈ దేశంలోనే లేదు. అంతర్జాతీయ మహిళా సమావేశాలకు హాజరయ్యేందుకు యూరప్‌లో పర్యటిస్తోంది."

ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టిన రవివర్మ వేపు చూడకుండానే - "ఇప్పుడు నేను వెళ్ళాల్సింది నర్సింగ్‌హోమ్‌కు. అక్కడ నా కొరకు నా ఫ్రెండు కాచుకొని ఉన్నాడు. మమ్మీ తిరిగి వచ్చేలోగా లేడీ డాక్టరుతో..." చెప్పుతూనే ఉంది.

రవివర్మకు అర్థమైపోయింది. అప్రయత్నంగా అతని చూపులు టీపాయ్ మీది 'ది యంగ్ మదర్' ప్రతిమమీద పడ్డాయి. "ఈ డబ్బు ఎలా సంపాదించావు అని అతడు అడిగితే ఏం చెపుతావు?"

గల గలా నవ్వింది ప్రత్యూష - "పిచ్చి ప్రశ్న! మేం ఒకరికోసం మరొకరం! అతడి అనతి లేనిదే ఊపిరి కూడా తీయను. ప్రకాశ్ నా ప్రాణం! నా సర్వస్వం! అతడి ప్రేమ ఎంత గొప్పదో తెలుసా? తన కోరిక చంపుకొని, తనకోసం ఉంచుకోకుండా మత్తుమందు నాకు అందిస్తాడు."

"ప్రకాశ్... అంటే...?"

"ఆర్కిటెక్చర్‌లో నా క్లాస్‌మేట్. ఎర్రగా, స్మార్ట్‌గా ఉంటాడు. హిల్ కాలనీ నుంచి ఎన్‌ఫీల్డ్ మోటర్ బైక్‌మీద వస్తాడు. అయినా ఎందు కడుగుతున్నావ్? ఓహో! నువ్వూ మా బాపతేనా? ప్రకాశ్‌ను నీకు పరిచయం చేస్తాను. ఏ రకం డ్రగ్గు కావాలో చెప్పు? సారిసారి కలిసినప్పుడు నీకోసం కూడానని ఎక్కువ మోతాదు తెమ్మని చెప్తాను ప్రకాశ్‌తో..."

కొద్దిగా తూలుకుంటూ, టిక్కు టిక్కు మనే చప్పుళ్ళతో హాండు బాగు ఊపుకుంటూ వెళ్ళిపోతూంది ప్రత్యూష.

కాళ్ళ కింద నేల కదిలిపోతున్నట్టు అనిపించింది - రవివర్మకు. తోటి ఉద్యోగుల మాటలు అతనికి వినబడడం లేదు. వరండా గుండా నడచి మెట్ల దగ్గరికి చేరుకున్నాడు.

సాగరం మీద చంద్రోదయమయింది. వెన్నెలా, నగర దీపాల వెలుతురూ కలగలిసి కెరటాలు మెరుస్తోంటే సముద్రం మండుతూ కాలిపోతున్న నిశ్చలన చిత్రం లాగ ఉంది. ★

